సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

వైభవంగా భక్తమార్కండేయ జయంతి



మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్న అర్చకులు, సంఘం ప్రతినిధులు

దాబాగార్డెన్స్: పాత నగరం బురుజుపేట భావనరుషి ఈశ్వరాలయంలో పద్మశాలి ఆత్మీయ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం భక్తమార్కండేయ జయంతి వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పార్వతీ పరమేశ్వరులకు, భావనరుషి భద్రావతి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహామృత్యుంజయ హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దేవతా మూర్తులను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, పద్మశాలి ఆత్మీయ సేవా సంఘం ప్రతినిధులు కొప్పుల రామ్‌కుమార్, పి.రాజారావు, నర్సింగరావు, సతీష్, హేమలత, తదితరులు పాల్గొన్నారు.


నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు.

కొమ్మూరు చిన్నయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

అల్లిపురం: పద్మనాభం మండలం ఏనుగులపాలెంలో నివాసం ఉంటున్న కొమ్మూరు చిన్నయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు కోరారు. ఈ మేరకు కలెక్టర్ మల్లికార్జునకు సోమవారం లేఖ రాసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న అప్పుల బాధ తాళలేక చిన్నయ్య కుటుంబం ఆత్మహత్యకు పాల్పడగా.. కుటుంబ యజమాని మృతి చెందగా అతని భార్య మంగమ్మ, కుమార్తెలు అనుప్రియ, మానసలు ప్రాణాప్రాయ స్థితి నుంచి బయటపడ్డారని పేర్కొన్నారు. కరోనాకు ముందు ఉపాధి నిమిత్తం చిన్నయ్య టాటా మ్యాజిక్ వాహనాన్ని రూ.8 లక్షలు అప్పుచేసి కొనుగోలు చేశారని పేర్కొన్నారు. కరోనా రావడంతో వాహనం మూలనపడి అప్పులు తీరలేదన్నారు. అది కాస్త వడ్డీతో కలిపి రూ.15లక్షలు కావటంతో వాటిని తీర్చడానికి అవకాశం లేక కుటుంబం సభ్యులు ఆత్మహత్యకు పాల్పడ్డారని లేఖలో పేర్కొన్నారు. ఈ ఘటనలో కుటుంబ పెద్ద మృతి చెందడంతో జీవనాధారం లేకుండా పోయిందన్నారు. ఈ పరిస్థితిని అర్థం చేసుకుని బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం... ఆదివారం సాయంత్రం రైల్వే స్టేషన్ 1వ నంబర్ ప్లాట్‌ఫారం పిల్లర్ నంబరు 20 వద్ద ట్రాక్‌పై ఓ వ్యక్తి మృతదేహం గుర్తించారు. జీఆర్పీ సీఐ ధనుంజయనాయుడు ఆదేశాలతో ఎస్ఐ బాలాజీరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని గుర్తించిన వారు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గల గవర్నమెంట్ రైల్వే పోలీసులకు స్వయంగా, లేదా 96661 22722, 94406 27547లో తెలియజేయాలని కోరారు.

పేద రోగులకు ఆపన్నహస్తం

ఆపదలో ఉన్న కుటుంబాలకు ఎమ్మెల్యే వాసుపల్లి ఆర్థిక సాయం



29వ వార్డులో ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



33వ వార్డులో ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద రోగుల కుటుంబాలకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అండగా నిలిచారు. సోమవారం నియోజకవర్గ పరిధిలోని పలు వార్డుల్లో 13 మందికి మొత్తం రూ.66వేలు సాయం అందజేసి మీకు నేనున్నానంటూ భరోసా కల్పించారు. కష్టం వస్తే కాల్ చేయండంటూ వారికి ధైర్యం చెప్పారు. 27వ వార్డు కుమ్మరవీధికి చెందిన జీరు వెంకటలక్ష్మి కుమారుడు భానురెడ్డి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి రూ.10వేలు అందజేశారు. 35వ వార్డు వెలంపేటకు చెందిన తెడ్లపు రాజులమ్మ, పెరికివీధికి చెందిన చెల్లిబోయిన అక్కమ్మ, పండావీధికి చెందిన మజ్జి అప్పలకొండ, పండా వీధికి చెందిన చిన్ని తండ్రి పిల్లి నూకరాజు, 32వ వార్డు నేరెళ్లకోనేరు ప్రాంతానికి చెందిన గేదెల సంజయ్‌కుమార్, 33వ వార్డు అమ్మవారి వీధికి చెందిన అండిబోయిన కుమారి, 29వ వార్డు రామజోగిపేటకు చెందిన ఆకుల దంతేశ్వరి, 30వ వార్డు దండుబజార్‌కు చెందిన వీర్ని వెంకట్రావు, కొత్త జాలారిపేటకు చెందిన వరిపల్లి ధనలక్ష్మికి రూ.5వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. 27వ వార్డు అశోక్‌నగర్‌కు చెందిన ఈతలపాక శంకర్రావు, యల్లాబల్లి జ్యోతికి చెరో రూ.3 వేలు చొప్పున సాయం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, పార్టీ నాయకులు, స్టేట్ డైరెక్టర్లు, పలు ఆలయాల చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



దొండపర్తిలోని బాధితులకు సహాయం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

వినతుల తక్షణ పరిష్కార దిశగా చర్యలు



అర్జీదారుల సమస్యలు వింటున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: ×జగనన్నకు చెబుదాం×లో వచ్చిన వినతులను తక్షణం పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. జ్ఞానాపురం జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీదారుల నుంచి ఆయన వినతులను స్వీకరించారు. వాటిని ఆయా విభాగాల అధికారులకు అందజేసి, సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ కార్యక్రమంలో 4 వినతులు అందాయని తెలిపారు. వినతుల్లో టౌన్‌ప్లానింగ్ విభాగానికి 2, యూసీడీ విభాగానికి 1, ఇంజినీరింగ్ విభాగానికి 1 చొప్పున ఉన్నాయన్నారు.

అధికారులతో సమీక్ష

సాయంత్రం సచివాలయ సిబ్బంది, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలపై వెంటనే స్పందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సూపరింటెండెంట్-1 టి.ఎస్.ఎన్.రాజు, సూపరింటెండెంట్-2 ఆర్.వి.రాజు, ఆర్వో బాబురావు, రాజ్యలక్ష్మి, ఈఈలు టి.ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, డీఈ భరణికుమార్, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ఊరట



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చొరవతో పూర్ణామార్కెట్ సమీప చిరు వ్యాపారులకు ఊరట లభించింది. ఇటీవల వన్ టౌన్ పోలీసులు ట్రాఫిక్ నిబంధనల్లో భాగంగా పూర్ణామార్కెట్ ప్రధాన రహదారిపై ఉన్న దుకాణాలు తొలగించారు. దీంతో బాధిత వ్యాపారులంతా వైఎస్సార్‌సీపీ 35వ వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి వద్దకు వెళ్లి తమ సమస్యను విన్నవించుకున్నారు. దీంతో ఆయన ఎమ్మెల్యే వాసుపల్లికి ఈ విషయం తెలియజేశారు. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే సోమవారం మధ్యాహ్నం పూర్ణామార్కెట్ వద్దకు వెళ్లి వ్యాపారులు, ట్రాఫిక్ పోలీసులతో మాట్లాడారు. విషయం చక్కదిద్దారు. వ్యాపారులు అధిక సంఖ్యలో జంగిడలు పెట్టకుండా, ఆశీలు చెల్లించకుండా ఉండేలా మాట్లాడి వ్యాపారాలు చేసుకునేలా ఊరట కలిగించారు. దీంతో వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు నాయకులు ఆదివిష్ణురెడ్డి, రూప, తదితరులు పాల్గొన్నారు.

ముఠా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ కార్యకర్తలు

మహారాణిపేట: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విశాఖ జిల్లా ముఠా కార్మిక సంఘం(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. వివిధ బజార్లలో పని చేస్తున్న ముఠా కలాసీలకు సంక్షేమ బోర్డు చట్టాన్ని ఏర్పాటు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.మన్మథరావు కోరారు. ఈ కార్యక్రమంలో ముఠా కార్మికుల సంఘం జిల్లా నాయకులు బి.సాంబయ్య, ఎం.చిట్టిబాబు, జి.సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్పందనలో వినతి పత్రం సమర్పించారు.

తహసీల్దార్ రమణయ్య కుటుంబానికి ఎక్స్‌గ్రేషియాపై హర్షం



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న అమరావతి జేఏసీ, రెవెన్యూ అసోసియేషన్ నాయకులు

మహారాణిపేట: ఇటీవల హత్యకు గురైన తహసీల్దార్ సనపల రమణయ్య కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంపై ఏపీ అమరావతి జేఏసీ జిల్లా అధ్యక్షుడు సత్తి నాగేశ్వర రెడ్డి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎ.త్రినాథ్ హర్షం వ్యక్తం చేశారు. ఘటన జరిగిన కొద్ది రోజులకే ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంపై సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. రమణయ్య భార్యకు రెవెన్యూ శాఖలో ఉద్యోగం ఇవ్వాలని, పిల్లలను చదివించడానికి చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌ను కోరారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి త్వరితగతిన విచారణ చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలని నాగేశ్వరరెడ్డి కోరారు.

పీవీకి ఘన నివాళి



పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పోలీసు రిటైర్డ్ అధికారుల సంఘం నాయకులు

మహారాణిపేట: దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న పురస్కారం ప్రకటించడంపై సోమవారం రిటైర్డు పోలీసు అధికారుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీవీ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. దేశ ఆర్థిక పురోగతికి పీవీ తీసుకున్న సంస్కరణలను గుర్తు చేసుకున్నారు. అసోసియేషన్ కోశాధికారి ప్రేమబాబు వందన సమర్పణ చేశారు. సీనియర్ రిటైర్డు పోలీసు అధికారులు కృష్ణంరాజు, కెంబూరి రామకృష్ణ, టీఎస్ఆర్ ప్రసాద్, శ్రీరంగం దివాకర్, కె.కె.ఆచారి, ప్రకాశరావు, రాముడు, సురేష్‌బాబు, శిఖామణి, ఎన్.ఎస్.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనా
- కలెక్టర్ మల్లికార్జునతో కలిసి పోలింగ్ బూత్‌ల పరిశీలన



వసంత బాల స్కూల్‌లో పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్‌మీనా, కలెక్టర్ మల్లికార్జున

సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిధిలోని పలు పోలింగ్ స్టేషన్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనా సోమవారం పరిశీలించారు. జీవీఎంసీ 24వ వార్డు గురుద్వార్ దరి వసంత బాల స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునతో కలిసి ఆయన పరిశీలించారు. అక్కడ కల్పించిన వసతులపై ఆరా తీశారు. అన్ని చోట్ల వికలాంగులు సులభంగా పోలింగ్ కేంద్రం లోపలకు చేరుకునేందుకు అనువుగా ర్యాంపులు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సౌకర్యం, తాగునీరు, ఫ్యాన్లు, ఇతర వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఓటర్లకు ఏమాత్రం ఇబ్బంది కలగకుండా వసతులు కల్పించాలని, పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయనతోపాటు ప్రత్యేక ఉప కలెక్టర్ డి.అఖిల, తహసీల్దార్ శ్రీరామమూర్తి, బీఎల్వోలు, ఇతర అధికారులు ఉన్నారు.

సెంట్రల్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఆరిలోవ యువకుడు

ఆరిలోవ: ఆరిలోవకు చెందిన ఓ యువకుడు సెంట్రల్ ట్యాక్స్ అండ్ కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యాడు. స్థానిక జ్యోతినగర్‌కు చెందిన అల్లంపల్లి ప్రవీణ్ విశాఖ అనిట్స్‌లో ట్రిపుల్ ఈ(ఈఈఈ) చదువుకున్నాడు. ప్రస్తుతం బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ)-2023 పరీక్ష రాశాడు. దీనిలో ప్రవీణ్ సెంట్రల్ టాక్స్ అండ్ కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యాడు. ఈ మేరకు ఆర్డర్ కాపీ సోమవారం ప్రవీణ్‌కు రిజిస్టర్ పోస్టులో అందింది. ప్రవీణ్‌కు విశాఖ జోన్‌లో పోస్టింగ్ ఇచ్చినట్టు ఆర్డర్ కాపీలో పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీలో ఆల్ ఇండియా ఎస్సీ కేటగిరీలో రెండో ర్యాంక్ వచ్చినట్లు ఈ సందర్భంగా ప్రవీణ్ తెలిపారు. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో ఎస్సీ కేటగిరీలో ఒకటో ర్యాంక్ వచ్చిందన్నారు. దీంతో ప్రవీణ్ తల్లిదండ్రులు అల్లంపల్లి రాజబాబు, జ్యోతి ఆనందం వ్యక్తం చేశారు.

15న జాబ్‌మేళా

కంచరపాలెం : స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 15న గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి నిట్టల శ్యామ్ సుందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హీరో మోటో, డైకిన్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 100 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారని తెలిపారు. ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, డిప్లమో, ఎంబీఏ ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. విశాఖపట్నంలో ఉద్యోగం చేయాలని, నెలకు రూ.13,450 నుంచి రూ.18,350 జీతం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. కంచరపాలెంలో గల జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో గురువారం ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని గిరిజనుల వినతి



ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావుకు వినతిపత్రం అందిస్తున్న గిరిజనులు

మహారాణిపేట: చినగదిలి మండలం సింహాచలం కొండపై నివసిస్తున్న గిరిజనులు, ప్రజా సంఘాల నాయకులు సోమవారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావును కలిశారు. విజయనగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో చైర్మన్‌ను కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన ఆయన ఈ సమస్యల ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు.

ఘనంగా ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ వార్షికోత్సవం

అల్లిపురం: ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్-1104 సుదీర్ఘ చరిత్రలో ఎన్నో విజయాలను సొంతం చేసుకుందని డిస్కం సెక్రటరీ వీఎస్ఆర్‌కే గణపతి అన్నారు. యూనియన్ 74వ వార్షికోత్సవాన్ని సోమవారం గ్రీన్‌పార్క్ హోటల్ దరి యూనియన్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గణపతి మాట్లాడుతూ యూనియన్ సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా అలుపెరగని పోరాటాలు చేస్తున్నామన్నారు. అనంతరం యూనియన్ సభ్యులు అధిక సంఖ్యలో రక్తదానం చేశారు. ముందుగా ఈ శిబిరాన్ని సూపరింటెండెంట్ ఇంజినీరు ఎల్.మహేంద్రనాథ్, జోన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు బి.సింహాచలం నాయుడు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి కార్మికుడు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రేమ సమాజంలో అనాథలు, దివ్యాంగులు, వృద్ధులకు అన్నదానం చేశారు.

ప్రజా రవాణాతో పర్యావరణ పరిరక్షణ



జీవీఎంసీ కార్యాలయానికి ఆర్టీసీ బస్సులో వస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

దాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరివెంకటకుమారి పేర్కొన్నారు. ఆమె తమ క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం తన చాంబర్‌లో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(గ్రీవెన్స్)కు హాజరయ్యారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై వచ్చారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎకో-వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో నగరంలో పర్యావరణ పరిరక్షణకు జీవీఎంసీ అనేక చర్యలు చేపడుతుందన్నారు. ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

విజయవంతంగా రూ.10కే భోజనం



భోజనం అందజేస్తున్న సంస్థ సభ్యులు

దాబాగార్డెన్స్: స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ విక్టోరియా(ఘోషాస్పత్రి) ఆస్పత్రి వద్ద కొంత కాలంగా నిర్వహిస్తున్న రూ.10కే భోజనం విజయవంతంగా కొనసాగుతోంది. ఆస్పత్రికి వచ్చే పేషెంట్ సహాయకులు, ఓపీకి వచ్చే రోగుల కోసం నాణ్యమైన భోజనాన్ని 290 రోజులుగా అందజేస్తున్నారు. ఈ సందర్భంగా రౌండ్ టేబుల్ సంస్థ సభ్యుడు మసూద్ అహ్మద్ మాట్లాడుతూ అన్నం, కూర, రసం తయారు చేయడానికే రూ.35 ఖర్చు అవుతుందని, అయినప్పటికీ దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగుల సౌకర్యార్థం రూ.10కే అందజేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, కోశాధికారి సీహెచ్.పైడిరాజు, సభ్యులు సత్తిబాబు, సత్యనారాయణ, శ్రీరామ్ పాల్గొన్నారు.

దిలీప్‌కుమార్‌కు నేషనల్ బెస్ట్ వర్కర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న దిలీప్‌కుమార్

దాబాగార్డెన్స్: నగరానికి చెందిన దిలీప్‌కుమార్‌కు వీఎంపీ నేషనల్ బెస్ట్ వర్కర్ అవార్డు లభించింది. వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారు. దిలీప్‌కుమార్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నారు. మానవ హక్కుల పరిరక్షణకు ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డు బహూకరించారు. సేవా రంగాల్లో విశేష కృషి చేస్తున్న వ్యక్తులకు ఏటా ఈ అవార్డు అందజేస్తారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్ మాట్లాడుతూ మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగిన ప్రాంతాల్లో బాధితులకు సేవలు అందిస్తున్నామన్నారు. మహిళల పట్ల హింస, వరకట్నం వేధింపులు, తప్పుడు కేసులు వంటి వాటికి వ్యతిరేకంగా పని చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసూన్ గోస్వామి, ఎంఆర్ అన్సారీ, ఏడీవీ పాయల్ పోపత్ని, డాక్టర్ చింతాడ శారదా, తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య, రక్తదాన శిబిరాలకు విశేష స్పందన



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం మెయిన్ రోడ్డులో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్, మెడికవర్ ఆస్పత్రి, రోటరీ బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మెగా రక్తదాన, వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. ఈ శిబిరాలను కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ప్రారంభించారు. సుమారు 56 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. సెయింట్ జోసఫ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, యువత చేస్తున్న సేవా కార్యక్రమాలను కార్పొరేటర్ పూర్ణిమ అభినందించారు. అనంతరం జన్మదిన వేడుకలు జరుపుకొంటున్న క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్‌కు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ బ్లడ్‌బ్యాంక్ డాక్టర్ అశోక్, కో-ఆర్డినేటర్ మాణిక్యం, రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో ముగ్గురి అరెస్ట్

- ఆటోలో వెంబడించి వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ
- సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నిందితుల గుర్తింపు



చిరుపాటి రాజు



చేపల ఆనంద్



కంబాల శ్రీ రాజు

అక్కిరెడ్డిపాలెం: వాకింగ్ చేస్తున్న వృద్ధురాలిని ఆటోలో వెంబడించి, ఆమె మెడలోని బంగారు గొలుసు, నగదు చోరీ చేసిన ముగ్గురు యువకులను గాజువాక పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఆ బంగారం కొనుగోలు చేసిన వ్యాపారిని కూడా అరెస్ట్ చేశారు. గాజువాక క్రైం సీఐ కె.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీహరిపురానికి చెందిన షియా ప్రసాద్‌సింగ్ (84) గత నెల 24న గొందేశిపాలెంలో వాకింగ్ చేస్తుండగా.. పెద గంట్యాడకు చెందిన చేపల ఆనంద్, కంబాల శ్రీ రాజు, హనుమంతవాకకు చెందిన చిరుపాటి రాజు ఆటోలో వెంబడించి ఆమె మెడలోని తులం బంగారు చైన్‌ను తెంచుకుపోవడంతోపాటు, ఆమె వద్ద గల నగదును కూడా లాక్కుని పరారయ్యారు. ఆమె వెంటనే గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి.. సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా దొంగల ఆచూకీని కనిపెట్టారు. విచారణలో ముగ్గురూ నేరం చేసినట్లు తేలడంతో, సోమవారం వారిని అరెస్ట్ చేసి, బంగారం, నగదుతో పాటు మద్యం సీసాలు, ఇనుప రాడ్డు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన బంగారాన్ని కొనుగోలు చేసిన దిగువ జాలారిపేటకు చెందిన సీహెచ్ ఎల్లాజీ (35)ని కూడా అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. సీఐ మాట్లాడుతూ క్రైం డీసీపీ వెంకటరత్నం, క్రైం ఏడీసీపీ గంగాధరం, జోన్-2 క్రైం ఏసీపీ సునీల్ ఆధ్వర్యంలో ఎస్ఐ మన్మథరావు, ఏఎస్ఐ రవి, కానిస్టేబుళ్లు కేసు దర్యాప్తు చేసి, నిందితులను గుర్తించగలిగారన్నారు. నిందితుల్లో ఒకరు పాత నేరస్తుడని తెలిపారు. ఆటో నంబర్ ప్లేట్ సరిగ్గా లేకపోయినా, పాతకేసును తిరగదోడి నిందితులను గుర్తించారని, సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా వారిని పట్టుకోగలిగారని తెలియజేశారు.

ఏపీఎండీసీకి ఏయూ విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎండీసీ) సంస్థలో ఉద్యోగాలకు ముగ్గురు ఏయూ విద్యార్థులు ఎంపికయ్యారు. ఏయూ ఎంహెచ్ఆర్ఎం కోర్సు చదువుతున్న ఎం.రవిశ్రీ కిరణ్, ఎం.ఎ.నూకరాజు, ఎమ్మెస్సీ ఎన్విరాన్‌మెంట్ సైన్స్ కోర్సు చదువుతున్న కుంచె అపూర్వ ఏపీఎండీసీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారికి వార్షిక వేతనంగా రూ.8.4 లక్షలు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఆచార్య జాలాది రవి, ఆచార్య అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.